



జలవనరుల శాఖలో ఇంజనీర్లు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. ప్రతి ఏడాదీ వేసవిలో ఉండే ఈ అవతారం ఈసారి మాత్రం వరదల పుణ్యమా అని ముందుగానే పోషిస్తున్నారు. టెండర్ల ద్వారా పనులు కేటాయించాల్సిన విధానానికి స్వస్తి పలికి నామినేషన్ పర్వానికి తెరదీస్తున్నారు. తద్వారా తమకు బినామీలుగా ఉన్న కాంట్రాక్టర్లను తెరపైకి తెచ్చి వారికే పనులు కేటాయించాలని సిఫార్సులు చేస్తున్నారు.

ఇంజనీర్లే కాంట్రాక్టర్లు

జలవనరుల శాఖలో జలగలు

ఎఫ్‌డీఆర్ పనులకు సిద్ధమవుతున్న ప్రతిపాదనలు


- టెండర్లకు స్వస్తి పలికే యోచనలో డీఈలు
- రెండు సబ్ డివిజన్లలో జోరుగా పైరవీలు
- తెరపైకి బినామీ కాంట్రాక్టర్లు
- నామినేషన్‌పై పనులు ఇవ్వాలని సిఫార్సులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఈనెలలో ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. బుడమేరకు భారీస్థాయిలో వరద వచ్చింది. దీంతో అన్ని కాల్వలు నిండుగా ప్రవహించాయి. వరద దాటికి కొన్ని ప్రాంతాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో కాల్వలకు గండ్లు పడ్డాయి. ఫలితంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో కాల్వల కరకట్టకు భారీగానే నష్టం వాటిల్లింది. వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పూడ్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వరదల వల్ల జరిగిన నష్టం లెక్కలను, వాటిని సరిచేయడానికి అయ్యే అంచనాలను రూపొందించాలని ఆదేశించింది. దీంతో జలవనరుల శాఖ అధికారులు కట్టలకు జరిగిన నష్టాలు, పలుచోట్ల పడిన గండ్లకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేశారు. ఫ్లడ్ డ్యామేజీ రిలీఫ్ పనులకు అంచనాలు రూపొందిస్తున్నారు.

ఆ రెండు డివిజన్లలో బినామీ బాగోతం

గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో దోసపాడు ఛానల్ ఉంది. ఇది కోమటిగుంట లాకుల నుంచి నందివాడ మండలం కుదరవల్లి వద్ద కొల్లేరులో కలుస్తుంది. ఇందులోనే జొన్నపాడు సెక్షన్ ఉంది. ఇది వెంట్రపాడు రెగ్యులేటర్ దాటిన తర్వాత 21వ కిలోమీటరు నుంచి 35వ కిలోమీటరు వరకు కాళింగపేట వద్ద బుడమేరులో కలుస్తుంది. జొన్నపాడు సెక్షన్ పరిధిలో కట్టలకు గండ్లు పడ్డాయి. వాటిని స్థానికంగా ఉండే రైతులు పూడ్చేసుకున్నారు. (మిగతా 6లో)

నీటి కష్టాలు ఆవరించి..



మచిలీపట్నం మండలం నెలకుర్రులో నీరులేక ఎండిపోతున్న వరిపొలం

శివారు ప్రాంతంలో అన్నదాతల అవస్థలు

- 9వ నెంబరు కాలువలో సాగునీరు శూన్యం
- 10 వేల ఎకరాల్లో ఎండుతున్న నారుమడులు
- తక్షణమే నీరు విడుదల చేయాలని రైతుల గగ్గోలు
- లేకుంటే క్రాప్ హాలిడే ప్రకటించే యోచన

అన్నదాతకు ఎంత కష్టం.. వారం క్రితం వరకూ ఉప్పెనలా విరుచుకుపడిన వరద వణికిస్తే.. ఇప్పుడు పంట నిలుపుకునేందుకు చుక్కనీరు లేక సతమతమయ్యే దుస్థితి నెలకొంది. ఈ ఏడాది ప్రారంభం నుంచీ రైతన్నలను కష్టాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. వరదలకు దెబ్బతిన్న పంటలను తొలగించి మళ్లీ వరి నాట్లు వేస్తే ఆ పొలాలకు ఇప్పుడు సాగునీరు అందడం లేదు. పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొంది. ఇంజన్లతో తోడుకునేందుకు కాలువల్లో చుక్కనీరు లేదు. 9వ నంబరు కాలువ పరిధిలోని మచిలీపట్నం మండలంలో పలు గ్రామాల్లో రైతులు ఏం చేయాలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. తక్షణమే కాలువలకు సాగునీరు అందించాలని వేడుకుంటున్నారు. నీరు విడుదల చేయకుంటే మండలంలో దాదాపు 10వేల ఎకరాల్లో క్రాప్ హాలిడే ప్రకటిస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కేఈబీ కాలువ నుంచి 9వ నెంబరు ప్రధానకాలువ ద్వారా మచిలీపట్నం మండలంలోని శివారు ప్రాంతాల్లోని పంట పొలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. మచిలీపట్నం మండలంలోని పెదయాదర, చిన్నాపురం, తుమ్మలచెరువు, కోన, పాతేరు, భోగిరెడ్డిపల్లి, వాడపాలెం, వాడగొయ్యి, భవానీపురం, వెంకటదుర్గాంబపురం, నెలకుర్రు, ఎస్‌గొల్లపాలెం, సింహాచలం, తదితర గ్రామాలకు 9/3, 9/4, 9/5, 9/7వ నెంబర్లతో ఉన్న బ్రాంచ్ కాలువల ద్వారా సాగునీటిని పొలాలకు అందించాలి. శివారు ప్రాంతాలకు సాగునీటిని సక్రమంగా విడుదల చేయడం లేదనే కారణంతో నెలక్రితం చల్లపల్లి సెక్షన్ నీటిపారుదలశాఖ ఏఈని మార్చేశారు. వేరొక ఏఈని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన కాలువల వెంట వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంట సమయం అవుతుండటంతో శివారు ప్రాంతాలకు సాగునీటి విడుదలను పట్టించుకునేవారే కరువయ్యారు.

రెండుసార్లు నారుమడులు పోసినా..

మచిలీపట్నం మండలంలోని వాడపాలెం, తుమ్మలచెరువు తదితర గ్రామాల్లో రైతులు ఇప్పటికే నారుమడులు రెండు విడతలుగా పోశారు. మొదటిసారి పోసిన నారుమడులు భారీవర్షాల వల్ల చనిపోయాయి. దీంతో రెండో విడత నారుమడులు పోశారు. ప్రస్తుతం ఈ నారుమడులు సాగునీరందక చనిపోతున్నాయి. రైతులు అష్టకష్టాలు పడి బయటి నుంచి అధిక ధరకు వరినారు కొనుగోలు చేసి నాట్లు పూర్తిచేసే పనిలో ఉన్నారు. తుమ్మలచెరువు, తుమ్మలపాలెం, వాడగొయ్యి తదితర గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాలకుపైగా భూమి ఉండగా, 400 ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఈ పొలాలకు సాగునీరు అందకపోవడంతో పైరు చనిపోయే దశకు చేరుకుంది. రెండో విడతలో పోసిన నారుమడులు చనిపోతున్నాయి. 9వ నెంబరు ప్రధానకాలువ వాడపాలెం, భవానీపురం గ్రామాల నుంచి ప్రవహించి కేపీటీపాలెం వద్ద ముగుస్తుంది. కేపీటీపాలెం సమీపంలో నుంచి కమ్మవారిచెరువు గ్రామానికి 9వ నెంబరు బ్రాంచ్ కాలువ ద్వారా సాగు, తాగునీటిని అందించాల్సి ఉంది. కేపీటీపాలెం, కమ్మవారిచెరువు గ్రామాలకు ఇంతవరకు పూర్తిస్థాయిలో సాగునీరు చేరనేలేదు. వాడపాలెం రైతులు 9వ నెంబరు ప్రధానకాలువలో ఉన్న కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజన్లు పెట్టి కాలువ పక్కనే ఉన్న భూములకు మళ్లించి ప్రస్తుతం వరినాట్లు వేస్తున్నారు. కాలువకు దూరంలో ఉన్న భూములకు సాగునీటిని తోడేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు మిన్నకుండిపోతున్నారు.

9/4వ నెంబరు కాలువ పరిస్థితి దయనీయం

9/4వ నెంబరు కాలువ ద్వారా భోగిరెడ్డిపల్లి, నెలకుర్రు, ఎస్‌గొల్లపాలెం, సింహాచలం తదితర గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ భూములకు 20 రోజులుగా సాగునీటిని విడుదల చేయలేదు. నాట్లు వేసిన పొలాలకు నీరు అందుబాటులో లేక వరిపైరు చనిపోయే స్థితికి చేరుకుంది. ఈ కాలువకు సాగునీటిని విడుదల చేస్తున్నట్టుగా నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నా భోగిరెడ్డిపల్లి దాటి చుక్కనీరు దిగువకు రావడం లేదు. ఆయిల్ ఇంజన్లతో నీటిని పెడదామన్నా కాలువలో నీరు లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పదిహేను రోజులుగా చుక్కనీరు దిగువకు రాలేదని నెలకుర్రు, ఎస్‌గొల్లపాలెం రైతులు అంటున్నారు.

9/7, 9/5 కాలువలకు చేరని సాగునీరు

9/7వ నెంబరు కాలువ ద్వారా కోన, పల్లెతుమ్మలపాలెం గ్రామాలకు సాగు, తాగునీరు అందాలి. సాగునీరు విడుదల చేయకపోవడంతో పల్లెతుమ్మలపాలెంలోని తాగునీటి చెరువును ఇంతవరకు నింపనేలేదు. రైతులు కోనలో నారుమడులు పోయగా సాగునీరు రాకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. 9/5వ నెంబరు కాలువ ద్వారా పాతేరుకు సాగునీరు అందాలి. ఇంతవరకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయకపోవడంతో ఈ గ్రామంలో నారుమడులు ఎండిపోతున్నాయి.

రెండు రోజుల్లో నీటి ఎద్దడిని నివారిస్తాం

9వ నెంబరు ప్రధాన కాలువకు సాగునీటి విడుదలలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పొలాలు మునిగిపోతాయనే భయంతో రైతులు నీటిని పొలాల నుంచి బయటకు తీశారు. దీంతో నీటి ఎద్దడి ఏర్పడింది. బుధవారం నుంచి 9/5, 9/7 నెంబరు కాలువలకు నీటిని విడుదల చేస్తున్నాం. రెండు రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతాం.

- రావెళ్ల రవికిరణ్, డీఈ, అవనిగడ్డ డివిజన్ నీటిపారుదలశాఖ

క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితులున్నాయి


9/7, 9/5వ నెంబరు కాలువలకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి సాగునీటిని సక్రమంగా విడుదల చేయలేదు. తుమ్మలచెరువు, చుట్టుపక్కల గ్రామాల రైతులు ఇప్పటికే రెండుసార్లు నారుమడులు పోశారు. నీరులేక నారుమడులు, నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. సెప్టెంబరు చివరిలోనూ సాగునీరు అందకపోవడంతో క్రాప్ హాలీడే ప్రకటించే పరిస్థితి ఉంది.

- వక్కపట్ల శ్రీనివాసరావు, తుమ్మలచెరువు

అధికారులు సాకులు చెబుతున్నారు

శివారు ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయమని కోరితే నీటిపారుదలశాఖ అధికారులు ఏవేవో సాకులు చెబుతున్నారు. వర్షం ఆధారంగా 40 శాతం, కాలువల నీటి ద్వారా 60 శాతం వ్యవసాయం ఉంటుందని అంటున్నారు. శివారు ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయకుండా సాకులు చెబితే ఎలా? సాగునీరు రాకపోవడంతో శివారు ప్రాంత రైతులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు.

- ఒడుగు నాగపోతురాజు, సర్పంచ్ కొత్తపల్లెతుమ్మలపాలెం



బుడమేరు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ శాటిలైట్ చిత్రం

బుడమేరుపై గురి!

ఆక్రమణల సంగతి తేల్చే పనిలో అధికారులు

బెజవాడ వాసులను బెంబేలెత్తించిన బుడమేరు ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. అసలు బుడమేరు విస్తీర్ణం ఎంత? ఏయే సర్వే నంబర్లలో విస్తరించి ఉంది? అనే వివరాలను సేకరిస్తోంది. ప్రత్యేక సర్వే ద్వారా ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులను బుడమేరుకు సంబంధించిన సమగ్ర వివరాలు సమర్పించాలని కలెక్టర్ సృజన బుధవారం ఆదేశించారు.

- (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

- సమగ్ర వివరాలు కోరిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్
- రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులకు బాధ్యతల అప్పగింత
- ఆక్రమణల తొలగింపునకు సర్వే
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ దాటి మరీ ఆక్రమణలు
- చాలా వరకు కాలనీలుగా విస్తరింపు


ప్రభుత్వ పరిశీలన తర్వాత యాక్షన్

బుడమేరు పరీవాహక ప్రాంత సర్వే నెంబర్ల వారీగా బుడమేరు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) దాని బఫర్ జోన్ (బీజెడ్)లను నిర్ణయిస్తారు. అంతిమంగా ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. ఆక్రమణలకు సంబంధించి ప్రభుత్వ పరిశీలన అనంతరం అధికారులు రంగంలోకి దిగుతారు. బుడమేరు ఆక్రమణలకు ఎలా గురైందో 2009లోనే అప్పటి మునిసిల్ కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న నేతృత్వంలో అధ్యయనం చేశారు. 2011లో ఎఫ్‌టీఎల్, దాని బఫర్ జోన్‌లలో ఆక్రమణలు ఏ విధంగా చొచ్చుకు వచ్చాయో విజయవాడ విపత్తు ప్రణాళిక - 2011లో పొందుపరిచారు. అప్పట్లోనే శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఆక్రమణలను నిగ్గు తేల్చారు.

బుడమేరు చరిత్రలోనే తొలిసారి

చరిత్రలో చవిచూడని విధంగా ఈ ఏడాది 40 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో దిగువకు ఏకంగా 35 వేల క్యూసెక్కులను విడుదల చేయాల్సి రావడంతో 32 డివిజన్లు ముంపునకు గురయ్యాయి. విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, గన్నవరం మండలాలు కూడా బుడమేరు వరద ముంపును ఎదుర్కొన్నాయి. బుడమేరుకు వచ్చే వరదను వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ ద్వారా కృష్ణానదికి మళ్లించటం వల్ల ఇన్నాళ్లు వరదను చూడలేదు. ఇటీవల బుడమేరు ఫుల్ ట్యాంక్ లెవల్ దాటి దాని బఫర్ జోన్‌లోకి వరద భారీగా పోటెత్తింది. ఎఫ్‌టీఎల్, దాని బఫర్ జోన్ పరిధిలో ఆక్రమణల వల్ల వరద అనేక దిశలను మార్చుకుని విజయవాడలో సగం ప్రాంతాన్ని ముంచెత్తింది.

ఆక్రమణలు ఇలా



బుడమేరు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఆక్రమణల శాటిలైట్ చిత్రం

బుడమేరు బఫర్ జోన్ (బీజెడ్) పరిధిలోకి 2011లోనే కండ్రిక, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, పీఅండ్‌టీ కాలనీ, ఇందిరానాయక్ కాలనీ, విజయదుర్గ నగర్, అయోధ్య నగర్ కొంత భాగం, పాత రాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేట, సింగ్‌నగర్ ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ చాలా వరకు 2011 నాటికే బలమైన కాలనీలుగా ఏర్పడ్డాయి. అప్పట్లో కార్పొరేషన్ నేతృత్వంలోనే ఆయా కాలనీలకు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించడంతో క్రమంగా అవి మరింత విస్తరించాయి. బుడమేరు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి కూడా వచ్చాయి. ఆక్రమణలను తొలగించాలంటే కాలనీలకు కాలనీలే కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఇలాంటి సందర్భంలో బుడమేరు కాల్వ సరిహద్దులను నిర్ణయించి కృష్ణావాల్ మాదిరిగా రెండు వైపులా రిటెయినింగ్ వాల్స్ నిర్మించాలన్న సూచనలు కూడా వస్తున్నాయి. ఎనికేపాడు దగ్గర యూటీని తొలగించి దాని స్థానంలో బాక్స్ కల్వర్టును ఏర్పాటు చేస్తే నగరానికి ఇబ్బందిలేకుండా కొల్లేటిలోకి బుడమేరు వెళ్లిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఉచిత ఇసుక విధానంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

నేటి నుంచి ఆన్‌లైన్‌లో ఉచిత ఇసుక

మచిలీపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉచిత ఇసుక విధానం గురువారం నుంచి అమలవుతుందని కలెక్టర్ బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో జిల్లా శాండ్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక ఆన్‌లైన్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రారంభిస్తారని తెలిపారు. ఉచిత ఇసుక బుకింగ్‌ను గ్రామ, వార్డు సచివాలయాల నుంచి కూడా చేసుకోవచ్చని అన్నారు. ఈ నేపథ్యంలో సచివాలయాల్లో పనిచేసే సిబ్బందికి ఇసుక ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసే విధానంపై శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో మాన్యువల్‌గా అమలుచేసే ఇసుక రీచ్‌లు ఎనిమిది ఉన్నాయని, వాటి అనుమతి ఫిబ్రవరి నెలతో ముగుస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఇసుక కొరత ఏర్పడకుండా రెవెన్యూ, మైనింగ్ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి కొత్త రీచ్‌లను ముందస్తుగానే గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన ఇసుక రీచ్‌ల వద్ద స్టాక్‌యార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో సమస్యలుంటే వాటిని పరిష్కరించడానికి ఫెసిలిటేషన్ సెంటరును ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఇసుక రవాణా చార్జీలు వసూలు చేస్తారన్నారు. ఈ సమావేశం అనంతరం జిల్లా గనులశాఖ అధికారి కొండారెడ్డి ట్రాన్స్‌పోర్టర్లతో కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో సమావేశం నిర్వహించారు. ఇసుక రవాణా కోసం ఆసక్తిఉన్న ఏజెన్సీల జాబితాలను తయారుచేసి ఇస్తే పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఉచిత ఇసుక రవాణా కోసం ఏర్పాటుచేసే వాహనాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీటీసీ పురేంద్ర, జిల్లా భూగర్భ గనులశాఖ అధికారి విజయవర్ధనరావు, డీపీవో నాగేశ్వరనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈశివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోలాహలంగా గిరిప్రదక్షిణ

బాద్రపద శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారి గిరిప్రదక్షిణ బుధవారం కోలాహలంగా సాగింది. అమ్మవారు ఉత్సవ మూర్తులను తొలుత కొండపై నుంచి మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద వరకు తీసుకువచ్చారు. అక్కడ పూజలు నిర్వహించి హారతులు సమర్పించారు. తప్పెట వాయిద్యగాళ్లు, సన్నాయి మేళగాళ్లు, కోలాట బృందాల విన్యాసాలతో గిరిప్రదక్షిణ ముందుకు సాగింది. కుమ్మరిపాలెం సెంటర్, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్‌ల మీదుగా తిరిగి అమ్మవారి వాహనం కొండపైకి చేరుకుంది. - వన్‌టౌన్



ఒక వర్గం వారితో చర్చలు జరుపుతున్న ఎస్ఐ గణేష్‌కుమార్

గణేశ నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ

» చెన్నూరులో ఉద్రిక్తత

పెడన : వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి పెడన మండలం చెన్నూరులో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగి గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం రాత్రి గ్రామంలో ఒక వర్గం వారు వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు వెళుతూ ఊరేగింపులో డీజే పాటల పట్ల మరోవర్గం అభ్యంతరం తెలిపింది. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. ఆ వర్గం వారు ఊరేగింపులోని డీజే బాక్సులను ధ్వంసం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వారంతా రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఉన్నతాధికారులకు పరిస్థితి వివరించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు చెన్నూరుకు చేరుకున్నారు. సీఐ హబీబ్ బాషా, ఎస్ఐ గణేష్‌కుమార్‌ల పర్యవేక్షణలో గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పెడన స్టేషన్‌లో బుధవారం ఇరువర్గాలకు చెందిన పెద్దలతో ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ అబ్దుల్ సుభాని, ఇన్‌స్పెక్టర్లు కాశీవిశ్వనాథ్, మూర్తి చర్చలు జరిపారు. రాజీ యత్నాలు ఫలించడంతో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జనం చేశారు.

చిట్టీల పేరుతో రూ.50 లక్షలకు టోకరా!

» పెనుమల్లిలో న్యాయం చేయాలని బాధితుల మొర

పెడన రూరల్ : చిట్టీల పేరుతో స్థానికులకు రూ.50 లక్షల కుచ్చు టోపీ వేసిన వైనం పెనుమల్లి గ్రామంలో వెలుగుచూసింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కాగిత శివకుమార్ కొంతకాలంగా గ్రామంలో చిట్టీల వ్యాపారం చేస్తూ, పాట సొమ్మును వారికి ఇవ్వకుండా అధిక వడ్డీ ఆశచూపి తనవద్దే ఉంచుకునేవాడు. అధిక వడ్డీకి ఆశపడిన పలువురు బాధితులు అప్పులు తెచ్చి మరీ శివకుమార్‌కు ఇచ్చారు. తీరా తమ సొమ్ములు అడిగితే రేపు, మాపు అంటూ వాయిదాలు వేస్తూ శివకుమార్ గ్రామం విడిచి పరారయ్యాడు. బాకీలు చెల్లించలేనంటూ బాధితులకు కోర్టుద్వారా నోటీసులు కూడా పంపాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఊసా నాగమణి, గరికపాటి దుర్గ, ఆరేపల్లి కొండ, జన్ను సురేష్, పిల్లంగోళ్ల ఆంజనేయులు, పడమట స్వామి, బొమ్మసాని నాగు, జోగి రాంబాబు తదితరులు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



అవనిగడ్డ : మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక కృష్ణా నది నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు నది ఒడ్డునే ఇసుక తవ్వేస్తున్నారని, కొన్ని రోజుల క్రితం కృష్ణానది వరదల కారణంగా దక్షిణ చిరువోలులంక వద్ద పెద్ద ఎత్తున లంక కోతకు గురైందని, దీనిని కూడా పట్టించుకోకుండా సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను తవ్వేస్తున్నా అధికారులు ఎవరు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. తమ గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి గ్రామం నదీ కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రణాళికా బద్ధంగా దసరా ఉత్సవాలు

» ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం

» ఎమ్మెల్యే సుజనా చౌదరి





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి
హాజరైన వివిధ విభాగాల అధికారులు

వన్‌టౌన్, సెప్టెంబరు 18 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వై.సుజనా చౌదరి అన్నారు. ఉత్సవాలపై బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భక్తుల సలహాలు, సూచనలు పొందాలని, ఇందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వీఐపీలు, వీవీఐపీలకు ప్రత్యేక టైమ్ స్లాట్‌లను కేటాయించాలన్నారు. భక్తులు వేచిఉండేందుకు స్థలాలను ఎంపిక చేయాలన్నారు.

● కలెక్టర్ సృజన మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా, సామాన్య భక్తులకు సంతృప్తికరమైన దర్శనం అందేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ లక్ష మందికి పైగా భక్తులు వస్తారని, మూలా నక్షత్రం రోజున 3 లక్షల మంది భక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలన్నారు. దాతల సహకారంతో భక్తులకు తాగునీరు, పాలు, అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూలా నక్షత్రం రోజున ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

● పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పోలీసులతో పాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 3,500 మంది పోలీసులను బందోబస్తుకు వినియోగించనున్నట్టు చెప్పారు. ప్రతి నిర్ణీత ప్రాంతం సెక్టారుకు ఒక ప్రత్యేక అధికారి పరిశీలనలో ఏర్పాట్లను పూర్తిచేయాలన్నారు. దుర్గాఘాట్ లోపల కమాండ్ కంట్రోల్ ద్వారా ఉత్సవాల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

● ఈవో కేఎస్ రామారావు మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో అక్టోబరు 3న బాలా త్రిపుర సుందరీదేవి, 4న గాయత్రి దేవి, 5న అన్నపూర్ణా దేవి, 6న లలితా త్రిపుర సుందరీదేవి, 7న మహాచండీ దేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి (మూలా నక్షత్రం), 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దినీదేవి, 12న రాజరాజేశ్వరిదేవి అలంకారాలలో కనకదుర్గమ్మ దర్శనం ఇస్తారన్నారు. అక్టోబరు 9న అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు.

దర్శనానికి ప్రత్యేక కౌంటర్లు

ఆన్‌లైన్ టిక్కెట్లే కాకుండా రిసెప్షన్, టోల్‌గేట్, ఓం టర్నింగ్, పున్నమీఘాట్, వీఎంసీ ఆఫీసు, కలెక్టర్ ఆఫీసు, స్టేట్ గెస్ట్ హౌస్, మోడల్ గెస్ట్ హౌస్, హెడ్‌వాటర్ వర్క్స్, బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద కరెంటు బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. వినాయకుడి గుడి నుంచి కొండపైన ఓం టర్నింగ్ వరకు మూడు క్యూలు ఉంటాయని, అక్కడ నుంచి ఉచిత దర్శనం, వీఐపీ క్యూలతో కలిసి మొత్తం ఐదు క్యూలు ఉంటాయి. వాటర్ ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిళ్లను కూడా భక్తులకు సరఫరా చేస్తామని ఈవో తెలిపారు.

ప్రసాదంగా 25 లక్షల లడ్డూలు

కనకదుర్గానగర్ వద్ద ప్రత్యేక కౌంటర్లతో పాటు ఓం టర్నింగ్ వద్ద కూడా ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొత్తంగా 25 లక్షల లడ్డూలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు అమ్మవారి ఉచిత ప్రసాదం కింద పులిహోర, కట్టుపొంగలి, దద్దోజనం, సాంబారు అన్నం, మహామండపం ఎదురుగాగల ఖాళీ ప్రదేశంలో అందిస్తామన్నారు.

అంచనా వ్యయం రూ. 9 కోట్లు

దుర్గగుడిలో దసరా మహోత్సవాలకు రూ. 9 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. వీటిలో ఇంజనీరింగ్ పనులకు సుమారు 3 కోట్ల రూపాయలకు పైగా వ్యయం అవుతుందని చెబుతున్నారు. విద్యుదీకరణ, షామియానాలతో పాటు హంసవాహనం తదితరాల కోసం నిధులను వెచ్చించనున్నారు.

● భక్తులు స్నానం చేసేందుకు సీతమ్మవారి పాదాల ఘాట్ వద్ద 500లు, పున్నమీఘాట్ వద్ద 100, భవానీ ఘాట్ వద్ద 100 చొప్పున షవర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 150 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

● ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సూచనలు, సలహాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సహకారంతో దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీసీపీలు గౌతమీశాలి, ఎం.కృష్ణమూర్తి నాయుడు, అదనపు డీసీపీలు జి.రామకృష్ణ, ఎం.రాజారావు, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవో భవానీ శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, దేవస్థానం ఈఈలు ఎల్.రమా, కోటేశ్వరరావు, ఏఈఓలు, ఆయా విభాగాల సూపరింటెండెంట్‌లు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బుడమేరు పరిధిపై నివేదికివ్వండి

» జిల్లా కలెక్టర్ సృజన

బుడమేరు వరద ముంపు నుంచి జిల్లా, నగరానికి శాశ్వత పరిష్కారం దిశగా.. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ అడుగులు వేస్తోంది.. దీనిలో భాగంగా సర్వే, భూ రికార్డులు, ఇరిగేషన్, వీఎంసీ సిటీప్లానింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవ సర్వే నెంబర్లతో సహా ఎంతమేర ఆక్రమణలకు గురైందీ.. పూర్తి నివేదిక సమర్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 18: ఆక్రమణల గుర్తింపునకు తొలిదశలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సృజన, బుధవారం సర్వే, భూరికార్డులు, నగరపాలక సంస్థ, రెవిన్యూ అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల బుడమేరు వాగు పరీవాహక ప్రాంతంలో కురిసిన కుంభవృష్టితో ఊహించని విధంగా ప్రమాదకరస్థాయిలో దాదాపు 43 వేల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో గండ్ల ద్వారా వచ్చిన నీటితో విజయవాడ రూరల్, నగర పరిధిలో లోతట్టు ప్రాంతాలు, పంటపొలాలు జలమయమయ్యాయని, నగరంలోని రెండు లక్షలకు పైగా కుటుంబాలు ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పది రోజులకు పైగా కలెక్టరేట్ లోనే పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులతో సమీక్షిస్తూ బుడమేరు గండ్లను పూడ్చడం, బాధితులను పరామర్శించి, పూర్తి సహాయసహకారాలు అందించారన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగోనేందుకు 'ఆపరేషన్ బుడమేరు'ను ప్రకటించారని, ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించి జలవనరుల శాఖ అర్బన్, సిటీ పరిధిలో కాలువ విస్తీర్ణ నివేదికలను రూపొందించాల్సిన అవసరముందన్నారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఈ నేపథ్యంలో ఆక్రమణల వాస్తవ వివరాలను సర్వే నెంబర్లతో సహా సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, జిల్లా సర్వే, నగరపాలక సంస్థ సర్వే విభాగం, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ఆక్రమణలపై సర్వే నెంబర్లతో నివేదిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ నిధి మీనా, సర్వే అండ్ ల్యాండ్ రికార్ఢ్స్ ఏడీ శ్రీనివాస్, నగరపాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లు

భారతీనగర్, సెప్టెంబరు 18 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఐటీఐ కోర్సుల్లో నాల్గవవిడత అడ్మిషన్లకు ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త విధానం ప్రకారం అభ్యర్థులు దరఖాస్తులో పేర్కొన్న కళాశాలకు సెప్టెంబరు 27వ తేదీ సాయంత్రం 5గంటలలోగా హాజరై ఒరిజినల్ సర్టిఫికెట్లను ఐటీఐలోని ప్రిన్సిపల్ వెబ్‌సైట్‌లో ధ్రువీకరించుకోవాల్సి ఉంది. జిరాక్స్ కాపీలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తును తీసుకురావాలి. ప్రభుత్వ ఐటీఐలో సెప్టెంబరు 28వ తేదీ, ప్రైవేట్ ఐటిఐలో సెప్టెంబరు 30 తేదీన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9490639639, 7780429468 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్



మైలవరం ఏసీపీగా ప్రసాదరావు


విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మైలవరం ఏసీపీగా వై.ప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ డీఎస్పీగా ఉన్న ప్రసాదరావును కొద్దిరోజుల క్రితం ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

కృష్ణా జిల్లా రిజిస్ట్రార్‌గా శైలజ

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా రిజిస్ట్రార్‌గా డి.శైలజ బదిలీపై వస్తున్నారు. గుంటూరు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శైలజను కృష్ణాజిల్లాకు బదిలీ చేయగా, మచిలీపట్నంలో జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.వి.వి.డి. ప్రసాద్‌ను ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేశారు.

పశుసంవర్థక శాఖ జేడిగా..

జిల్లా పశుసంవర్థక శాఖ జేడీగా చిన నరసింహులు నరసరావుపేట నుంచి బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. కృష్ణాజిల్లా పశుసంవర్థక శాఖ జేడీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు నెల్లూరుకు బదిలీ అయ్యారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణప్రసాద్

టీడీపీలోకి వైసీపీ సర్పంచ్..

పెడన : గూడూరు మండలం తరకటూరు సర్పంచ్ చిన్నం వెంకటరమణ వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గూడూరు టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, తరకటూరు గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

22న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు: నూజివీడులోని ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్ గ్రౌండ్స్‌లో ఈ నెల 22న ఉదయం 8 గంటలకు కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాలబాలికల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వీవీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి రెండు తర్వాత పుట్టిన బాల, బాలికలు అర్హులన్నారు. ఎంపికైన జట్లను అక్టోబరు 5 నుంచి 7వరకు వైజాగ్‌లోని నునపర్తిలో జరిగే ఏపీ అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు పంపుతామని ప్రసాద్ తెలిపారు. క్రీడాకారులు 9490334333లో సంప్రదించాలన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న సంఘం సభ్యులు

సీఎం సహాయ నిధికి రూ.24 లక్షలు

వన్‌టౌన్ : సీఎం సహాయ నిధికి ఆంధ్రప్రదేశ్ అద్దె బస్సుల యజమానుల సంఘం సభ్యులు బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలిసి రాష్ట్ర రవాణ, యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.24 లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వరద బాధితుల సహాయం కోసం మరింత మంది ముందుకు రావాలన్నారు.

ఆయిల్ టిన్నుల్లో మద్యం రవాణా

» పట్టుబడిన ఇద్దరు బెల్టు షాపు నిర్వాహకులు



అవనిగడ్డ, సెప్టెంబరు 18 : పోలీస్, ఎక్సైజ్ అధికారుల కళ్లు గప్పి, అక్రమ మార్గంలో మద్యాన్ని తరలించేందుకు ప్రయత్నించి ఇద్దరు బెల్టు షాపు నిర్వాహకులు అవనిగడ్డ పోలీసులకు పట్టుబడ్డారు. కోడూరు మండలం పాలకాయతిప్ప గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ శ్రీను, గోవిందరాజులు గ్రామంలో మద్యాన్ని అధిక ధరలకు విక్రయించేందుకు, ఎవరికీ అనుమానం రాకుండా ఆయిల్ టిన్నుల్లో మద్యాన్ని తరలించాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రెండు ఆయిల్ టిన్నులను కోసి వాటిలో 100 మద్యం సీసాలు ఉంచి అవనిగడ్డ నుంచి వాటిని తరలించేందుకు ప్రయత్నించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు తనిఖీ చేసి ఆయిల్ టిన్నుల్లో మద్యం బాటిళ్లను గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు అవనిగడ్డ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



పాల సేకరణలో 4 శాతం వృద్ధి

» చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్ : కృష్ణా మిల్క్ యూనియన్ ఈ ఏడాది పాల సేకరణలో నాలుగు శాతం వృద్ధిని సాధించిందని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. యూనియన్ టర్నోవర్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1200 కోట్లు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది శాతం వృద్ధిని సాధించిందన్నారు. ముంపు బారిన పడిన ఫ్యాక్టరీని త్వరితగతిన పునరుద్ధరిస్తామన్నారు. విపత్తుల్లో నష్టపోయిన ఫ్యాక్టరీకి మళ్లీ జీవం పోయడానికి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు.

క్రైం కార్నర్

రెండు వర్గాల ఘర్షణ

» ఐదుగురికి తీవ్ర గాయాలు

» 19 మందిపై కేసు నమోదు

జగ్గయ్యపేట, సెప్టెంబరు 18 : పాత కక్షలతో క్రిస్టియన్‌పేటలో మంగళవారం అర్ధరాత్రి సినీఫక్కీలో రెండు వర్గాలు కర్రలు, రాడ్లు, కారంతో దాడులు చేసుకుని భీతావహ వాతావరణం సృష్టించాయి. పరస్పర దాడుల్లో మహిళలూ పాల్గొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు వర్గాలపై లాఠీ ఝళిపించి చెదరగొట్టారు. జగ్గయ్యపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రిస్టియన్‌పేటలో టీడీపీ నేత కర్ల జోజి, వైసీపీ నేత రుంజా నాగయ్య వర్గాల మధ్య కొద్ది రోజులుగా స్వల్ప ఘర్షణలు, కవ్వింపులు జరుగుతున్నాయి. ఫిర్యాదులు రావటంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం రాత్రి వైసీపీ వర్గీయులు రెచ్చగొట్టటంతో టీడీపీ వర్గీయులు బాహాబాహీకి దిగారు. కర్రలు, రాడ్లు, కారంతో దాడులు చేసుకుని కొట్టుకున్నారు. దాడుల్లో జీ.హైమవతి (33), కార్తీక్‌కుమార్ (20), నాగమల్లేశ్వరరావు (30), పి.జ్యోతి (36), ఎం.లక్ష్మయ్య (37)లు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో జ్యోతి, లక్ష్మయ్యలను విజయవాడ రిఫర్ చేయగా, మిగిలిన ముగ్గురు జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐలు సంఘటనా స్థలంలో పరిస్థితిని పర్యవేక్షించారు. ఎం.లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కర్ల జోజి, కర్ల వెంకట్రావు, డేవిడ్, శేషయ్య, ఇ శ్రీకాంత్‌లపై, కర్ల వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రుంజా నాగయ్య, సాయి, బాబు, కె.డేవిడ్‌కుమార్, బత్తుల గోపి, జి.సాయి, బాబు, డేవిడ్ కుమార్, అయ్యప్ప, ఆర్.అంకమ్మ, మణి,అచ్చమ్మ, పిల్లి అచ్చమ్మ, జ్యోతి, విజయలపై వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

విభేదించాడని ప్రియుడి కారు దహనం

మచిలీపట్నం టౌన్: ఆరేళ్లపాటు తనతో స్నేహంగా ఉంటూ మోసం చేశాడన్న కోపంతో అతడి కారు దహనం చేసిన వైనమిది. చిలకలపూడి సీఐ నబి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొబ్బరితోటకు చెందిన బిల్డర్ విజయ్ తన కారును అనూష అనే మహిళ దహనం చేసిందని ఫిర్యాదు చేశాడు. దీంతో అనూషపై కేసు నమోదు చేశారు. కాగా 2017 నుంచి తనతో స్నేహంగా ఉంటూ ఉన్నట్టుండి మరో మహిళా ఉద్యోగినితో విజయ్ అక్రమంగా సంబంధం పెట్టుకుంటున్నాడని అనూష ఫిర్యాదు చేశారు. దీనిపై చిలకలపూడి పోలీసులు కారు దగ్ధం చేసిన నేరానికి అనూషపై కేసు నమోదు చేయగా, తనను మోసం చేశాడన్న అనూష ఇచ్చిన ఫిర్యాదుపై బిల్డర్ విజయ్‌పై మరొక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీర్లే కాంట్రాక్టర్లు

(5వ పేజీ తరువాయి)

ఇప్పుడు ఈ పనులను ఎఫ్‌డీఆర్‌లో చూపించడానికి ఇంజనీరింగ్ అధికారులు రంగం చేసుకున్నారు. పడిన గండ్లను రైతులు పూడ్చేసుకుంటే వాటికి ప్రతిపాదనలు చేస్తున్నారు. ఈ పనులకు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. పైగా ఈ పనులకు ఎలాంటి టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిన చేసుకునేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం ఉయ్యూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్ పేరును సిఫార్సు చేశారు. ఆయనకు నామినేషన్ పద్ధతిపై రూ.30 లక్షల పనులను అప్పగించడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్నారు. కాంట్రాక్టర్ పేరు ఉయ్యూరు వాసిదే అయినా పనులు మాత్రం ఈ సబ్‌డివిజన్‌లో ఉన్న ఒక ముఖ్యఅధికారి చేసుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఆర్సీ (రివర్ కన్జర్వేషన్) సబ్ డివిజన్‌లోనూ ఇదే తంతు నడుస్తోంది. ఇప్పటి వరకు ఎలాంటి ఇరిగేషన్ పనులూ చేయని కాంట్రాక్టర్‌ను తీసుకొచ్చి పనులను నామినేషన్ పద్ధతిపై అప్పగించాలని చూస్తున్నారు. ఈ విషయంలో సబ్‌డివిజన్‌లో ఒక కీలక అధికారి పావులు కదుపుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి దిగువ నుంచి ఇటు విజయవాడ వైపు, అటు తాడేపల్లి వైపు మొత్తం రివర్ కన్జర్వేషన్ పరిధిలోకి వస్తుంది. బ్యారేజీకి ఇటీవల వచ్చిన 11.47 లక్షల క్యూసెక్కుల వరద కారణంగా దిగువ ప్రాంతంలో కట్టలకు నష్టం జరిగింది. ఈ పనులను చేయడానికి రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న ఒక అధికారి మాజీ మంత్రి జోగి రమేష్‌కు ముద్దుల అనుచరుడిగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ రూ.50 లక్షల పనుల కోసం ఇప్పటి వరకు ఇరిగేషన్ పనుల్లో ఎలాంటి అనుభవమూ లేని కాంట్రాక్టర్‌ను తీసుకొచ్చారని జలవనరుల శాఖలో ప్రచారం నడుస్తోంది. ఆ కాంట్రాక్టర్ ఈ ఏడాది నుంచే ఇరిగేషన్, డ్రెయినేజీ పనుల్లో అడుగు పెట్టినట్టు సమాచారం. ఆయనను ముందుపెట్టి నామినేషన్‌పై పనులు కట్టబెట్టి ఎఫ్‌డీఆర్ సొమ్ములు వెనుకేసుకోవడానికి ఇంజనీర్లు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన కొంతమంది కాంట్రాక్టర్లు అధికారులను ప్రశ్నించారు. టెండర్లను ఆహ్వానించకుండా నామినేషన్ పద్ధతి ఏమిటంటూ అడిగారు. దీనికి ఆయా సబ్‌డివిజన్ల ఇంజనీర్లు కూటమి ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల పేర్లు చెబుతున్నట్టు సమాచారం.

డీటీ కోసం పోటీ!

» ఉన్నచోటే పాతుకుపోవటానికి నీచ వ్యవహారాలు

» ఒకరిపై ఒకరు లైంగిక, ఉద్యోగాల స్కామ్ ఆరోపణలు

» ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్

సివిల్ సప్లయిస్‌లో బదిలీల వ్యవహారం వ్యక్తిగత వైషమ్యాలకు దారి తీస్తోంది. బాపులపాడు డీటీ పోస్టు కోసం కొందరు ఉద్యోగులు ఎంతకైనా తెగించటానికి సిద్ధమౌతున్నారు. వ్యక్తిగతంగా అల్లరి చేసుకునే పరిస్థితికి దిగజారారు. ఈ వ్యవహారంలో కొందరు మహిళా డీలర్లను రోడ్డుకీడ్చే పనులు చేస్తున్నారు. కృష్ణా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ జంక్షన్ రూరల్)

కృష్ణాజిల్లా బాపులపాడు మండలంలో పీడీఎస్ డీటీ ప్రధాన్, రెవెన్యూ డీటీ రమణల మధ్య పోస్టింగ్‌ల వార్ నడుస్తోంది. బదిలీలలో భాగంగా రెవెన్యూ డీటీ రమణ, పీడీఎస్ డీటీ ప్రధాన్ తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదులు చేయించుకునే పరిస్థితికి దిగజారారు. రమణ గతంలో మహిళా డీలర్లతో అనుచితంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదులు ఉన్నాయి. లిఖిత పూర్వక ఫిర్యాదులు రాకపోవటంతో అతడిపై చర్యలు తీసుకోలేదు. నాలుగేళ్ల తర్వాత ఫిర్యాదు రాగా.. దాని వెనుక పీడీఎస్ డీటీ ప్రధాన్ హస్తం ఉందని తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. రమణ కూడా గతంలో ప్రధాన్ ఉద్యోగాల పేరుతో మోసం, ఆ తర్వాత వైసీపీ నేతల అండదండలతో మళ్లీ పోస్టింగ్ తెచ్చుకున్నాడన్న దానిపై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఇద్దరూ వ్యక్తిగతంగా పరస్పరం అల్లరి చేసుకోవటం వెనుక.. పీడీఎస్ డీటీ పోస్టును దక్కించుకోవటం కోసమేనని తెలుస్తోంది. మండలంలో పీడీఎస్ డీటీగా పనిచేయటం అంటే పేదల బియ్యం దేశ సరిహద్దులు దాటిపోవటం వెనుక రేషన్ మాఫియా శక్తులతో సంబధాలు కలిగి ఉండటమే కారణం. అందుకే ఇక్కడ డీటీకి విపరీతమైన పోటీ నెలకొంది. కృష్ణా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించి.. ఇద్దరినీ ఇక్కడి నుంచి కదిలించకపోతే తప్ప బాపులపాడు మండలం ప్రశాంతంగా ఉండే పరిస్థితి లేదని పలువురు పేర్కొంటున్నారు.

స్వలాభం కోసమే చీలికలు!



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రేషన్ డీలర్ల సంఘ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల రేషన్ డీలర్లపై పీడీఎస్ డీటీ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, రేషన్ డీలర్లపై దాడులు చేస్తూ స్వలాభం కోసం సంఘంలోనే చీలికలు తెచ్చారని మండల అధ్యక్షుడు ఆర్నేపల్లి శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సంఘ నాయకులు పీడీఎస్ డీటీ వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీడీఎస్ డీటీగా ప్రధాన్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అసోసియేషన్‌లో చీలికలు తీసుకువచ్చారని, ఎదురు మాట్లాడినా, నెలవారీ మామూళ్లు సకాలంలో ఇవ్వకపోయినా దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే ఇద్దరు మహిళా డీలర్లపై కక్షపూరితంగా ఆరు కేసులు నమోదు చేయించారని తెలిపారు. అదేమని అడిగితే తనకు సంబంధం లేదని, వైసీపీ నేతల ఒత్తిడి మేరకే అని వారిపై నెట్టేసేవారన్నారు. ప్రభుత్వం మారినా ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోగా జనసేన నాయకులను అడ్డుపెట్టుకుని పబ్బం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే శేఖర్‌కు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని పిలిపించి నాపైనే ఫిర్యాదు చేయడానికి నువ్వు ఎవడ్రా అంటూ దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు పెడతానని బెదిరించడంతో తప్పని పరిస్థితుల్లో నిరసన తెలియజేయాల్సి వచ్చిందని నాయకులు, డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను రాష్ట్ర సంఘానికి తెలియజేయగా మద్దతు ప్రకటించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు ధారావతు హరికృష్ణ, మండల కార్యదర్శి కగ్గా గాంధీ, కమిటీ సభ్యులు ఆకునూరి మాణిక్యాలరావు, మాతంగి కిషోర్, నల్ల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.45

అయ్యప్పకు అభిషేక పూజలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 18 : అభిషేక ప్రియుడైన అయ్యప్పస్వామికి వెంకటకృష్ణారావు గురుస్వామికి చెందిన పీఠంలో బుధవారం వైభవంగా అభిషేక పూజలు నిర్వహించారు. అంపాపురంలోని అయిల్‌పామ్ తోటలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి పీఠంలో గ్రామానికి చెందిన దీక్షాధారులతో కలిసి అయ్యప్పస్వామికి గంధం, విభూతి, పంచద్రవ్యాలు, పండ్లరసాలతో గురుస్వాములు కృష్ణారావు, చందు శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, సెప్టెంబరు 18 : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకట్ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 11కెవి రాయనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, బీఎస్ ఎన్ఎల్ ఆఫీస్, రెవెన్యూ కార్యాలయం, గాంధీ బొమ్మ సెంటర్, గౌడపేట, ప్రభుత్వ ఆస్పత్రి, చెంచుల కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఉయ్యూరు : విద్యుత్‌లైన్ల మరమ్మతులు దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శివాలయంరోడ్డు, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలరోడ్డు, అన్నాక్యాంటీన్, ఫ్లోరా స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 18 : భారీ వర్షాలకు, వరదలకు నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన నిర్మించేలా చర్యలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బుధవారం కానూరు ప్రధాన రోడ్డులో డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్వాకంతో కానూరు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైందన్నారు. కానూరు డ్రెయిన్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రధాన రోడ్డును తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ముప్పా రాజా, తాతపూడి గణేష్, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, యార్లగడ్డ సుచిత్ర, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



కానూరులో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తదితరులు

వరద బాధితులకు రూ. లక్ష సాయం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం పోరంకి శ్రీలక్ష్మీ రెసిడెన్సీ అసోసియేషన్ సభ్యులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. వరద బాధితులకు ఇతోధికంగా సాయపడుతున్న దాతలను బోడె అభినందించారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని కోరారు.







గన్నవరంలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థుల ర్యాలీ.. బందారుగూడెంలో.. బాపులపాడు డ్రెయిన్లలో దోమల మందు పిచికారి చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు

ఉయ్యూరు, సెప్టెంబరు 18 : పరార్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల సందర్భంగా బుధవారం నగర పంచాయతీ ఆధ్వర్యంలో ప్రధానసెంటర్‌లో విద్యార్థులు, ఉద్యోగులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం. సురేశ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఉయ్యూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు చేతబూని ప్రధాన రహదారిలో ప్రదర్శన చేపట్టారు. హెచ్‌ఎం జోత్స్నా దేవి, పీఈటీ రమణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



ఉయ్యూరు సెంటర్‌లో విద్యార్థుల మానవహారం

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

గన్నవరం : ప్రజలు వ్యక్తిగత శుభ్రతకు ఎంత ప్రాధాన్యత నిస్తారో పరిసరాల పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యత నిచ్చినప్పుడు ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుందని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛత హీ సేవా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంతో అభివృద్ధి, పరిశుభ్రత, చక్కటి ఆరోగ్యం లభిస్తుందన్నారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కార్యదర్శి అనిల్‌కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాపులపాడులో డ్రెయిన్ల పూడికతీత

హనుమాన్‌జంక్షన్ : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారం బాపులపాడులో మురుగు కాలువల పూడికతీత నిర్వహించారు. ప్రధాన వీధుల్లో డ్రెయినేజీల్లో పూడిక తీయించి దోమల నివారణ మందును పిచికారి చేయించారు. సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ పర్యవేక్షణలో ఈవో సీహెచ్ ప్రసాద్ పిచికారి పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షకార్యదర్శులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం. నాగేశ్వరరావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా రెండవ రోజు కార్యక్రమంగా డ్రెయిన్లు శుభ్రం చేసి దోమల మందు పిచికారి చేయించినట్లు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు.

బండారుగూడెంలో

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా గ్రామ పరిశుభ్రత సాధ్యమవుతుందని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. బండారుగూడెంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, సామాజిక ఆరోగ్యం కోసం ఇంటి చుట్టు ప్రక్కల పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో కుమార్, జ్యోతి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సామాజిక కార్యకర్త యలమంచిలి కిషోర్ బాబు

కంకిపాడు, సెప్టెంబరు 18 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలని సామాజిక కార్యకర్త యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సామూహిక సీమంతాల వేడుక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీవో ఎస్ సుకన్య, సూపర్‌వైజర్ శ్రీలత, అన్నామణి, విజయలక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు మాస్టారుకు ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 18 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన విద్యాప్రదాత యలమంచలి కోటేశ్వరరావు అని ఆళ్ల గోపాలకృష్ణ కొనియాడారు. కాకులపాడుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యలమంచలి కోటేశ్వరరావు(90) ఇటీవల వృద్ధాప్య అనారోగ్య కారణాలతో మృతి చెందారు. కాకులపాడులోని స్వగృహంలో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అట్లూరి శ్రీనివాస్, వేగిరెడ్డి పాపారావు, చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ

పామర్రు, సెప్టెంబరు 18: నిమ్మకూరు ఎన్టీఆర్ మహిళా సాధికారిత ప్రాంగణంలో ఈనెల 23నుంచి ఉచితంగా వృత్తివిద్యాకోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ జుబేదా పర్వీన్ బుధవారం తెలిపారు. కుట్టుమిషన్ మెకానిజం, బ్యూటీషియన్ కోర్సు, గార్మెంట్ కట్టార్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల మహిళలు ప్రాంగణంలో నేరుగా సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల బస్‌పాస్‌లకు వాకర్స్ ఆర్థికసాయం



ఉయ్యూరు, సెప్టెంబరు 18 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థినుల బస్‌పాస్‌ల నిమిత్తం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆర్థికసాయం బుధవారం ఆర్టీసీ సిబ్బందికి అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల సత్తార్‌కు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దూర ప్రాంతాలనుంచి పాఠశాలకు వచ్చేందుకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు అందజేస్తున్న నేపథ్యంలో అందుకు అవసరమైన మొత్తాన్ని అసోసియేషన్ సభ్యులు అందజేశారు. కార్యదర్శి పూర్ణచంద్రరావు, బాపిరాజు, సభ్యులు వెంకటేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, ఫుల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, ఆర్టీసీ ఉద్యోగులు శివన్నారాయణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద నిఘా పెంచాలి : ఎస్పీ



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18: జిల్లాలోని అన్ని బ్యాంకులు, శివారు ప్రాంతాల్లోని ఏటీఎంల వద్ద నిఘా పెంచాలని పోలీసులను ఎస్పీ ఆర్.గంగాధర రావు ఆదేశించారు. బుధవారం కాలేఖాన్ పేటలోని శివగంగ గుడి వద్ద ఉన్న యాక్సిస్ బ్యాంకు ఏటీఎంను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రత పెంచాలని ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో నేరాలు జరిగే అవకాశం ఉన్నందున ఏటీఎంల వద్ద గస్తీ ముమ్మరం చేయాలన్నారు. నైట్ పెట్రోలింగ్ చేసే అధికారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి సెక్యూరిటీ గార్డులను నియమించేలా, సీసీ కెమెరాలను ఏటీఎంల వద్ద పెట్టేలా చూడాలన్నారు.



హుండీ లెక్కింపులో భక్తులు, అర్చకులు

అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.14.36లక్షలు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 18 : స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గడిచిన 105 రోజులకు గాను హుండీలో రూ14,36,287లు లభించినట్లు దేవస్థానం ఈవో కె. శ్రీనివాస్ తెలిపారు. ఎండోమెంట్ అధికారి ఏ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో దేవస్థానం మాజీ పాలక మండలి చైర్మన్ పావులూరి రామారావు, స్థానిక ప్రముఖులు గరికపాటి నాగేశ్వరరావు, మట్టా శ్రీనివాసరావు, వడ్డి వాసవి పలు భజన సమాజం భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

సచివాలయానికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు జంక్షన్ నాయకుల వినతి



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 18 : బాపులపాడు మండలంతో పాటు ప్రక్కనే గల పెదపాడు, నూజివీడు మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం హనుమాన్‌జంక్షన్ బస్టాండ్ నుంచి అమరావతి సచివాలయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యార్లగడ్డను కలిసి మంగళవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. వివిధ మండలాలకు చెందిన ప్రజలు విద్య, వైద్యం కోసంతో పాటు అమరావతిలోని సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వెళుతున్నారని వివరించారు. వివిధ కారణాలతో వెళ్లే వారికి తగిన(డైరెక్ట్) బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుని ఉదయం, సాయంత్రం బస్ సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగిరెడ్డి పాపారావు, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంగూరులో చిల్లీస్ రెస్టారెంట్ ప్రారంభం




రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తదితరులు

పెనమలూరు, సెప్టెంబరు 18 : గంగూరు సెంటరులో మూడేళ్లుగా నిర్వహిస్తున్న చిల్లీస్ రెస్టారెంట్‌ను బుధవారం గంగూరు విజయా గార్డెన్స్ ఆవరణలో (ఇండియన్ ఆయిల్ బంకు ప్రక్కన) తిరిగి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ చిల్లీస్ రెస్టారెంట్ అధినేత కంఠంనేని రాధాకృష్ణను అభినందించారు. శుచిశుభ్రతతో కస్టమర్లకు రుచికరమైన భోజనం అందించడంలో చిల్లీస్ పేరెన్నికగన్నదని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నేత పాతూరి నాగభూషణం, సినీ నటులు రఘుబాబు, గౌతమ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

ఉయ్యూరు, సెప్టెంబరు 18 : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనల నిమిత్తం గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కెఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. 9959224796 సెల్ నంబరుకు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు తెలపాల్సిందిగా కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.45

23 నుంచి వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ

పామర్రు, సెప్టెంబరు 18: నిమ్మకూరు ఎన్టీఆర్ మహిళా సాధికారిత ప్రాంగణంలో ఈనెల 23నుంచి ఉచితంగా వృత్తివిద్యాకోర్సులు ప్రారంభిస్తున్నట్టు ప్రాంగణం మేనేజర్ జుబేదా పర్వీన్ బుదవారం తెలిపారు. నెల రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో కుట్టుమిషన్ మెకానిజం, బ్యుటీషియన్, గార్మెంట్ కట్టార్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని ఆమె తెలిపారు. ఆసక్తిగల మహిళలు ప్రాంగణంలో నేరుగా సంప్రదించాలని ఆమె సూచించారు.

నేత్రదానం

నాగాయలంక, సెప్టెంబరు 18: అనారోగ్యంతో మృతిచెందిన ఏడో వార్డుకు చెందిన నాగిడి నాంచారయ్య(75) నేత్రాలను కుటుంబసభ్యుల సహకారంతో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. సుదర్శి మానవత సేవా సంస్థ నుంచి ఇది 208వ నేత్రదానమని నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు.



కోనేరుసెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న బండి రామకృష్ణ, జనసేన నాయకులు

ఘనంగా ఎంపీ బాలశౌరి జన్మదినోత్సవం

● బండి రామకృష్ణ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18: "బందరుకు మెడికల్ కాలేజీ, బందరు పోర్టుకు నిధులు తెచ్చిన ఘనత ఎంపీ వల్లభనేని బాలశౌరిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మచిలీపట్నం అభివృద్ధికి నిధులు తెచ్చే సత్తా ఆయనకు ఉంది." అని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. బాలశౌరి పుట్టినరోజు వేడుకలను బుధవారం రామకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. జనసేన కార్యాలయంలో, కోనేరుసెంటర్‌లో బండి రామకృష్ణ కేక్ కట్‌చేశారు. నగరంలో జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ల కూడళ్లలో కేక్‌లు కట్ చేశారు. వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెదయాదర, చిన్నాపురం గ్రామాల్లో జనసేన నాయకుడు గల్లా తిమోతి కేక్ కట్ చేశారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, నాయకులు కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము, మణిబాబు, వంపుగడల చౌదరి, కోలపల్లి గణేష్, పృథ్వీరాజ్, శాయన శివయ్య, తిరుమలశెట్టి నాగరాజు పాల్గొన్నారు. 45వ డివిజన్ ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్ ఆధ్వర్యంలో సిడింబి అగ్రహారంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మచిలీపట్నం మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు కొనకళ్ల భాను, సీహెచ్ పోతురాజు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి బంగారుబాబు ఆర్థిక సాయం

చల్లపల్లి: ఎంపీ వల్లభనేని బాలశౌరి పుట్టినరోజు సందర్భంగా పాగోలు ఎంపీటీసీ సభ్యుడు మేకా సత్యనారాయణప్రసాద్(బంగారుబాబు) పేద విద్యార్థినికి ఆర్థిక సాయమందించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థిని రావివరపు గాయత్రికి ఐదు వేల రూపాయలు అందజేశారు. చల్లపల్లి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో ఎంపీ పుట్టినరోజు వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ర్యాలీని ప్రారంభిస్తున్న మండలి వెంకట్రామ్



గుడివాడలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు



గుడ్లవల్లేరులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో కృష్ణవేణి

పరిశుభ్రతతో ఆరోగ్య భద్రత

రెండో రోజూ కొనసాగిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు

అవనిగడ్డ, సెప్టెంబరు 18: పరిశుభ్రతతో ఆరోగ్యం భద్రంగా ఉంటుందని, ప్రతీ గ్రామం స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని సాధించాలని గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎంపీడీవో మరియదేవి, ఈవోపీఆర్డీ కె.బాలాత్రిపుర సుందరి, పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు జి.బి.ఎస్. గోపాల్, భాను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో ర్యాలీ

గుడ్లవల్లేరు: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్సపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, సచివాలయ కార్యదర్శి కె.సుధారాణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

గుడివాడ రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఈవోపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు లింగవరం, వలివర్తిపాడు గ్రామాల్లో నిర్వహించారు. లింగవరంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనాథ్ ఆధ్వర్యంలో, వలివర్తిపాడులో ఈవోపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ వల్లభనేని సూరిబాబు, కార్యదర్శులు కె.అనూల, లింగవరం, వలివర్తిపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.



నంగేగడ్డలో విద్యార్థుల సైకిల్ ర్యాలీ

నంగేగడ్డలో స్వచ్ఛతా రన్

నాగాయలంక: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా నంగేగడ్డ గ్రామపంచాయతీలో మహిళలతో స్వచ్ఛతా రన్, నడక, విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో జె.కె.సీతారామ్‌కుమార్, ఈవోపీఆర్డీ కె.అప్పనరసమ్మ, పంచాయతీ కార్యదర్శి పి.మల్లికార్జునరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుడివాడలో సైకిల్ ర్యాలీ

గుడివాడ: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంలు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు, గుడివాడ సైక్లింగ్ సభ్యులు, కూటమి నాయకులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద నిఘా పెంచాలి

● పోలీసులకు ఎస్పీ గంగాధరరావు ఆదేశం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18: జిల్లాలోని అన్ని బ్యాంకులు, శివారు ప్రాంతాల్లోని ఏటీఎంల వద్ద నిఘా పెంచాలని పోలీసులను ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశించారు. బుధవారం కాలేఖాన్‌పేటలోని శివగంగ గుడి వద్ద ఉన్న యాక్సిస్ బ్యాంకు ఏటీఎంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శివారు ప్రాంతాల్లో నేరాలు జరిగే అవకాశం ఉన్నందున ఏటీఎంల వద్ద గస్తీ ముమ్మరం చేయాలని, నైట్ పెట్రోలింగ్ చేసే అధికారులు తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి సెక్యూరిటీ గార్డులను నియమించేలా, సీసీ కెమెరాలను ఏటీఎంల వద్ద పెట్టేలా చూడాలని సూచించారు.



కాలేఖాన్‌పేటలో ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

గుడివాడ: నెహ్రూచౌక్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. రాజేంద్ర నగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో వారు కలిశారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు దారం కరుణాకర్, ఉపేంద్ర, పెయ్యల సురేష్, చింతా నాని పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు వినతిపత్రం అందిస్తున్న అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు

వీఆర్వోకు క్షమాపణలు..సమసిన వివాదం

చల్లపల్లి, సెప్టెంబరు 18: మాజేరు వీఆర్వో నాగమల్లేశ్వరరావుపై వైసీపీ సర్పంచ్ భర్త కోళ్లపల్లి లక్ష్మీనారాయణ దురుసుగా ప్రవర్తించి బ్యాగ్‌ను బయటకు విసిరేసిన వివాదం సద్దుమణిగింది. బుధవారం గ్రామ పెద్దలు, అధికారుల సమక్షంలో వీఆర్వోకు లక్ష్మీనారాయణ క్షమాపణ చెప్పారు. బీపీ పెరిగి ఆవేశంలో తొందరపడ్డానని ఆయన పశ్చాత్తాపడ్డారు. దీంతో ఫిర్యాదుల వరకూ వెళ్లకుండా కథ సుఖాంతమైంది.

తెలుగు సినీరంగానికి

ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు

● ఏఎన్నార్ శతజయంతి వేడుకల్లో మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, సెప్టెంబరు 18: "తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు. క్రమశిక్షణతో నటనా జీవితాన్ని సాగించారు. నేటితరం నటులకు వారు ఆదర్శం. తెలుగుభాషా పరిరక్షణకు అక్కినేని నాగేశ్వరరావు ఎంతో కృషి చేశారు. తెలుగు చిత్రపరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడానికి ఆయన ముఖ్య కారకుడు." అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను ఘంటసాలలోని వర్లు బిటీసీ కళాశాలలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా బుద్ధప్రసాద్ విచ్చేశారు. అక్కినేని మిత్రుడు, ఆంధ్ర పత్రిక సహ సంపాదకుడు వి.వి.నరసింహారావు కుమారుడు వేమూరి విశ్వేశ్వరరావును సత్కరించి మెమెంటో బహూకరించారు. సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, బండి పరాత్పరరావు, విశ్రాంత హెచ్‌ఎం పోతన వెంకటేశ్వరరావు, గాయకులు పాల్గొన్నారు.



ఘంటసాలలో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

చంద్రబాబుకు కృతజ్ఞతలు

వరదల బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ ప్యాకేజీ ప్రకటించిందన్నారు. సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పశుపోషకులకు వరిగడ్డి పంపిణీ

మోపిదేవి: వరద ప్రభావిత గ్రామమైన బొబ్బర్లంకలో టీడీపీ ఘంటసాల మండల నాయకులు పశుపోషకులకు సమకూర్చిన వరిగడ్డి పంపిణీని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. నడకుదుటి జనార్ధనరావు, తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, కోనేరు శివలీల, బాలజగన్నాథరావు, కోనేరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



టీడీపీ ఘంటసాల మండల నాయకులు సమకూర్చిన వరిగడ్డిని బొబ్బర్లంకలో పంపిణీ చేస్తున్న బుద్ధప్రసాద్

జీవో 115 రద్దు చేయాలి

గుడివాడ: జీవో 115ను రద్దు చేయాలని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు నర్సులు డిమాండ్ చేశారు. బుధవారం ఏరియా ఆస్పత్రి గేటు వద్ద వారు నిరసన ధర్నా నిర్వహించారు. ఎన్జీవోస్ అసోసియేషన్ గుడివాడ తాలుకా యూనిట్ ఉపాధ్యక్షురాలు నిర్మల లారెన్స్ మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్న వారికి స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వం తెచ్చిన జీవో 115ను వెంటనే రద్దు చేయాలని నిరసన తెలుపుతున్న నర్సులకు ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దతు తెలియజేస్తున్నామని ఆమె తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లక్ష్మి, ప్రసన్న, బ్లాండిన తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ప్రభుత్వాసుపత్రి గేటు వద్ద నిరసన తెలుపుతున్న నర్సులు

30 మంది రైతులకు పవర్‌స్ప్రేయర్ల పంపిణీ

చల్లపల్లి, సెప్టెంబరు 18: చల్లపల్లి లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆముదార్లంక వరద బాధిత రైతులు 30 మందికి రూ.లక్ష వ్యయంతో చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పవర్ స్ప్రేయర్లను అందజేశారు. గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులకు వాటిని పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ కోశాధికారి ముమ్మనేని నాని, పెద్దలు నర్రా సాయిబాబు, ఏఎల్ఆర్‌కే ప్రసాద్, కొల్లిపర మధు, దోనేపూడి గోపీకృష్ణ, కంఠంనేని సుధాకరరావు, కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, గోవిందరాజుల అశ్వినీకుమార్, ఎం.వి.కృష్ణారావు, ఉప్పల సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు పవర్‌స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం, లయన్స్‌క్లబ్ నేతలు

పొలాల ముంపు సమస్యకు పరిష్కారం

అవనిగడ్డ, సెప్టెంబరు 18: కోడూరు మండలానికి చెందిన నాలుగు గ్రామాల్లో పొలాల ముంపు సమస్యకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ పరిష్కారం చూపారు. సాలెంపాలెం, పిట్టంలంక గ్రామాల మధ్య కరకట్ట కింద ఉన్న సింకు పూడుకుపోవడంతో సాలెంపాలెం, బడేవారిపాలెం, బావిశెట్టివారిపాలెం, నారేపాలెం గ్రామాల పొలాలు కొద్దిపాటి వర్షానికే ముంపు బారిన పడి రైతులు నష్టపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముందు ఆ ప్రాంత రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యను విక్కుర్తి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చి ప్రొక్లెయినర్ సమకూర్చాలని, రైతులంతా కలిసి డ్రెయిన్ పూడిక తీసుకుంటామని కోరారు. వెంటనే ఆయన ప్రొక్లెయినర్‌ను సమకూర్చారు. బుధవారం రైతులు చేయించుకుంటున్న పనులను శ్రీనివాస్ సోదరుడు విక్కుర్తి రాంబాబు పరిశీలించారు.

క్రీడల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

అవనిగడ్డ, సెప్టెంబరు 18: అవనిగడ్డ సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు రేపల్లెలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ గేమ్స్‌లో అత్యధిక బహుమతులు సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రిన్సిపాల్ అమలా పుష్పం, వైస్ ప్రిన్సిపాల్ మోని వారిని అభినందించారు. రేపల్లెలోని మెంట్ పోర్ట్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఇంటర్ స్కూల్ గేమ్స్ లిటరీ కల్చరల్ కాంపిటేషన్‌లో పాఠశాలకు చెందిన దాదాపు 30 మంది ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.



సాధించిన పతకాలను చూపుతున్న సెయింట్ ఆన్స్ విద్యార్థులు

సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థులకు 28 పతకాలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18: హైదరాబాద్‌లో నిర్వహించిన క్రీడల పోటీల్లో సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో 28 పతకాలు, అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో విజేతలను పాఠశాల కరస్పాండెంట్ జోజిబాబు, ప్రిన్సిపాల్ ఆంథోని అభినందించారు. కో-ఆర్డినేటర్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ లిస్సమ్మ, పీడీలు ఉమాకాంత్, రాజేష్, అనూష పాల్గొన్నారు.



పతకాలు గెలుచుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్ జోజిబాబు, ప్రిన్సిపాల్ ఆంథోని

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాన్‌బాబుకు బంగారు పతకం

గుడివాడ: ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి పెద్ది జాన్‌బాబు బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో జాన్‌బాబును ఘనంగా సత్కరించారు. జాన్‌బాబును వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, ఏ.వో బాలాజీ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పెనుమోతు వంశీకృష్ణకు సత్కారం

గుడివాడ: బెంగళూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ జాతీయ పురస్కారాన్ని గుడివాడకు చెందిన పెనుమోతు వంశీకృష్ణ అందుకున్నారు. ఆయనను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, రాష్ట్ర నాయకుడు రామినేని వెంకటకృష్ణ, పట్టణ అధ్యక్షుడు యర్రపోతు అర్జున్, నాయకులు ఆంజనేయులు, కె.కె.డి.ప్రసాద్, మేక శ్రీనివాసరావు, లీలాకుమారి, లక్ష్మీనారాయణ, కొత్త కిరణ్, పల్లపోతు మురళీ, పరుచూరి మురళి తదితరులు సత్కరించారు.

హిందీ ఉపాధ్యాయులకు సబ్జెక్టు కాంప్లెక్స్

కూచిపూడి, సెప్టెంబరు 18: నిడుమోలు జడ్పీ పాఠశాలలో బుధవారం మొవ్వ, గూడూరు, పామర్రు మండలాల ఎంపీయూపీ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయులకు సబ్జెక్టు కాంప్లెక్స్ నిర్వహించారు. ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపుదలపై దృష్టికి సారించాలని జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ అన్నపూర్ణమ్మ సూచించారు. హిందీలో విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేలా బోధించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లు చాంద్ బాషా, రెహమాన్, చాంద్ ఉస్మాన్, కరీముస్నీసా, ప్రసాద్ పాల్గొన్నారు.



తోడేళ్లదిబ్బలంకలో వరద బాధితులకు నిత్యావసరాల కిట్లను అందిస్తున్న అగ్గిరామయ్య, వీరంకి గురుమూర్తి

నిత్యావసరాల కిట్ల పంపిణీ

తోట్లవల్లూరు, సెప్టెంబరు 18: తోడేళ్లదిబ్బలంక, కాళింగదిబ్బలంకల్లోని 250 వరద బాధిత కుటుంబాలకు బుధవారం దేవరపల్లి అగ్గిరామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు అగ్గి రామయ్య, టీడీపీ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు.

అట్టహాసంగా నిమజ్జనం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 18: తోట్లవల్లూరు సినిమాహాలు బజారులో పూజలందుకున్న గణనాథుడిని బుధవారం భక్తులు ట్రాక్టరుపై అలంకరించి డప్పు వాద్యాలతో గ్రామంలో అట్టహాసంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ముందుగా 15 కిలోల లడ్డూకు వేలం పెట్టగా వీరంకి వెంకట హరి పవన్ రూ.29 వేలకు దక్కించుకున్నారు.

శివాలయంలో పూజలు

కోడూరు, సెప్టెంబరు 18: ఉల్లిపాలెంలో కైవలానంద సరస్వతీస్వామి మందిరం(శివాలయం)లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కోడలు మండలి సాయిసుప్రియ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండే శ్రీనివాసరావు, తలశిల స్వర్ణలత, సుంకర లక్ష్మి, విశ్వనాథపల్లి పాప, గోగినేని సోమశేఖరరావు, ఉల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఉప్పులూరి చొరవతో రహదారికి మోక్షం


తోట్లవల్లూరు, సెప్టెంబరు 18: నాటి వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రొయ్యూరు-కంకిపాడు ఆర్ అండ్ బీ రహదారిని తమ గ్రామ పరిధిలో ఒక కిలోమీటరు వరకు గోతులు పూడ్చి అభివృద్ధి చేసినట్టు టీడీపీ నేత ఉప్పులూరి గోపాలకృష్ణ తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లుక్కా రేణుకారావు కొందరు గ్రామస్తులతో కలిసి విలేకరులకు రోడ్డు అభివృద్ధిని ఆయన తెలిపారు. రూ.72 వేలతో ఆరు లారీల క్వారీ మెటల్‌ను గోతుల్లో వేసి పూడ్చామని, ఆ తరువాత గ్రామ పంచాయతీ వారు రోలింగ్ చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో రొయ్యూరు క్వారీ నుంచి వందల కోట్ల ఇసుక ఆదాయం పొందినప్పటికీ రొయ్యూరు ప్రధాన రహదారికి ఎలాంటి నిధులు కేటాయించలేదని, దాంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సులు తిరిగేందుకు ఇబ్బందిపడేవారన్నారు. ఇటీవల కృష్ణానది వరదలకు తోడేళ్లదిబ్బలంక గ్రామస్థులకు నాలుగు రోజుల పాటు 6వేల మందికి భోజనం, అల్పాహారం పెట్టానని, తోడేళ్లదిబ్బలంక, పిల్లివానిలంకలోని రైతుల పశువులకు రూ.68 వేలతో వరిగడ్డి, దాణా కట్టలను అందించానని, జనవరిలో అగ్నిప్రమాదంలో ఇల్లుదగ్ధమైన చిగురుపాటి రామ కోటేశ్వరరావుకు రూ.4 లక్షలు తన సొంత డబ్బులు, దాతలు ఇచ్చిన రూ.1.50 లక్షలతో గృహం నిర్మించి ఇచ్చామని గోపాలకృష్ణ తెలిపారు.



తన సొంత నిధులతో రొయ్యూరు-కంకిపాడు రహదారిపై గోతుల పూడ్చాక రోడ్డును చూపుతున్న ఉప్పులూరి గోపాలకృష్ణ

రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు

కూచిపూడి, సెప్టెంబరు 18: ప్రభుత్వ ఆదేశాలతో బ్రిటీష్ కాలం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగుతున్న పోడియంను తొలగించి సిబ్బందితో విధులు నిర్వహించే ప్రక్రియ మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభమైంది. మొవ్వ సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మంగళవారం నుంచి ఈ తరహా విధానంలో విధులు నిర్వహిస్తున్నారు.



మొవ్వలో పోడియం తొలగించి విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు